క్లుప్తంగా

జాతీయ సైన్స్ ఫెయిర్‌లో మన విద్యార్థులు



సైన్సు ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులు

విశాఖ విద్య: జాతీయ స్థాయి సైన్స్ ఫెస్టివల్‌లో పెందుర్తి మండలం నరవ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు భాగస్వాములయ్యారు. ఈ నెల 17 నుంచి 20 వరకు న్యూఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి సైన్సు విజ్ఞాన ప్రదర్శనలో ఏపీ నుంచి నరవ పాఠశాల విద్యార్థులకు అవకాశం దక్కింది. పదో తరగతి విద్యార్థులు డి.మనోజ్ సాయి, గౌతమ్, 9వ తరగతి విద్యార్థులు జి. సౌజన్య, జి. ఉషాదేవి, 8వ తరగతి విద్యార్థి జి. యుగంధర్ తయారు చేసిన 'ఫోల్డ్ స్కోప్'(మైక్రోస్కోప్) ప్రదర్శించారు. వీరికి మార్గదర్శిగా జిల్లా సైన్స్ ఆఫీసర్ కప్పల ప్రసాద్ వ్యవహరించారు.

రేపు చంద్రమౌళీశ్వర ఆలయంలో పూజలు

విశాఖ విద్య: అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని 90వ వార్డు సుసర్ల కాలనీలోని పార్వతీ పరమేశ్వర ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇచ్ఛారపు నాగేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక పూజల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకను విజయవంతం చేయాలని కోరారు.

ఏయూ వీసీ ప్రసాదరెడ్డికి అభినందనలు



వీసీప్రసాదరెడ్డిని అభినందిస్తున్న పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా సభ్యులు

మల్కాపురం: ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా రెండో సారి బాధ్యతలు స్వీకరించిన పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని పలువురు అభినందించారు. వీసీ కార్యాలయంలో శనివారం పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా (విశాఖ) ప్రతినిధులు ఎం.కాళీ (చైర్మన్ పీఆర్ఎస్ఐ), ఎ.గోవింద్‌రావు (కార్యదర్శి పీఆర్ఎస్ఐ), యు.ఎస్.శర్మ (నేషనల్ వైస్ ప్రెసిడెంట్ పీఆర్ఎస్ఐ), ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాం అందజేసి శాలువ కప్పి అభినందించారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ములగాడ-2 సచివాలయం పరిధిలోని పిలకవాని పాలెం ప్రాంతానికి చెందిన కనకరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా కలిగి ఉండడంతో మృతుడి కుటుంబానికి శనివారం బీమా తక్షణ సాయం రూ.10 వేలు కార్పొరేటర్ లావణ్య అందించారు.

బాలరాముడి వర్ణ చిత్రాల పోటీకి ఆహ్వానం

మహారాణిపేట: అయోధ్యలో ప్రారంభానికి ముస్తాబైన రామాలయం గురించే దేశం మొత్తం మాట్లాడుకుంటున్న శుభ తరుణంలో ప్రత్యేకించి చిన్నారులను ఈ సంబరాలలో భాగస్వాములు చేయాలని వేద విజ్ఞాన సమితి నిర్ణయించింది. వారి కోసమే బాలరాముడి వర్ణ చిత్రాల పోటీ నిర్వహించి, మొదటి ముగ్గురు విజేతలకు రూ. 1,116 బహుమతిగా అందించడంతో పాటు పాల్గొన్న వారందరికీ ప్రశంసాపత్రాలనూ అందించనుంది. ప్రముఖ చిత్రకారులు సుదురుపాటి అప్పల నరసయ్య (సయ్య మాస్టర్) పోటీల వివరాలను వెల్లడించారు. 6 నుంచి 15 ఏళ్ల మధ్య గల పిల్లలు ఎవరైనా, ఏ ప్రాంతం నుంచైనా అయినా వారి ఇంట్లోనే ఉండి ఈ పోటీలో పాల్గొనవచ్చని అప్పలనరసయ్య తెలిపారు. బాల రాముడు ప్రధాన అంశంగా వేసిన ఒక వర్ణ చిత్రాన్ని, పేరు, ఊరు, చదువుతున్న తరగతి రాసి ఫొటో తీసి ఈనెల 21వ తేదీలోపు సెల్ నంబర్ 81256 74182కు వాట్సప్ ద్వారా పంపాలని ఆయన కోరారు.

రహదారులకు కొత్తరూపు

- 60వ వార్డులో సర్వీస్ రోడ్ల అభివృద్ధి
- రూ.లక్షలతో బీటీ రోడ్ల నిర్మాణం
- అభివృద్ధి పనులపై స్థానికుల హర్షం

ఇది కదా అభివృద్ధి

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోంది. వార్డులోని పలు ప్రాంతాల్లో సుమారు రూ.3 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. ముఖ్యంగా ఇక్కడి ప్రధాన రహదారులు, సర్వీస్ రోడ్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మోక్షం లభించింది. నాడు రాళ్లు తేలి, గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైన రహదారులను నేడు అద్దంలా తీర్చిదిద్దారు. గతంలో వార్డులోని అధ్వాన సర్వీస్ రోడ్లపై ప్రయాణాలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు కొత్తగా అభివృద్ధి చేసిన రహదారులపై వాహన చోదకులు సాఫీగా రాకపోకలు సాగిస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వార్డులో పర్యటించిన వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ప్రజల ఇబ్బందులను, స్థానిక సమస్యలను గుర్తించారు. వాటి గురించి వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ ద్వారా తెలుసుకుని వెంటనే అధికారులతో మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న రహదారుల స్థానంలో కొత్తగా బీటీ రోడ్లు నిర్మింపజేశారు. సమస్య పరిష్కారమవడంతో ఆడారి ఆనంద్‌కుమార్, పి.వి.సురేష్‌లకు ఆయా ప్రాంతాల వాసులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



నాడు: అధ్వానంగా గుల్లలపాలెం వుడా కాలనీ రోడ్డు



నేడు: వుడా కాలనీలో నిర్మించిన బీటీ రోడ్డు



నాడు: జవహర్‌నగర్‌లో అధ్వానంగా బీటీ రోడ్డు



నేడు: జవహర్‌నగర్‌లో కొత్తగా వేసిన బీటీ రోడ్డు

నిధులు.. కొత్త రహదారులు

- వార్డులోని గుల్లలపాలెం వుడా కాలనీ ప్రధాన మార్గంలో రూ.30 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించారు.
- వుడా కాలనీ ఇంటర్‌నల్ రోడ్డుకు రూ.19.80 లక్షలు ఖర్చు చేశారు.
- జవహర్‌నగర్ ప్రధాన సేవా మార్గంలో రూ.19 లక్షలతో బీటీ రోడ్డు వేశారు.
- వీటీ కాలేజీ ప్రాంతం నుంచి బర్మా కాలనీ దుర్గాదేవి ఆలయానికి వెళ్లే మార్గంలో రూ.15 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించారు.

తక్షణం సమస్యల పరిష్కారం



గుల్లలపాలెం వుడా కాలనీ ప్రధాన రహదారితోపాటు, వీధుల్లోని బీటీ రోడ్లను అభివృద్ధి చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి రోడ్ల సమస్యను తీసుకెళ్లడంతో తక్షణం పరిష్కరించారు.

– రాజేశ్వరి, గుల్లలపాలెం వుడా కాలనీ

హామీలు నెరవేరుస్తున్నాం



జీవీఎంసీ ఎన్నికల సమయంలో వార్డు ప్రజలకు ఇచ్చిన హామీలను వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సహకారంతో నెరవేరుస్తున్నాం. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడూ ముందుంటాను.

– పి.వి.సురేష్, కార్పొరేటర్, 60వ వార్డు

అద్దంలా సర్వీస్ రోడ్లు



జవహర్‌నగర్ ప్రధాన సర్వీస్ రోడ్డు నాడు అధ్వానంగా ఉండేది. నేడు లక్షల రూపాయల వ్యయంతో మా ప్రాంతంలో అద్దంలా మెరిసే బీటీ రోడ్డు వేశారు. ఇప్పుడు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రయాణిస్తున్నాం.

– ఆడారి హరీష్, జవహర్‌నగర్

రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు



జీవీఎంసీ 60వ వార్డులో వివిధ అభివృద్ధి పనులకు రూ.3 కోట్లు ఖర్చు చేశాం. రానున్న రోజుల్లో మరో రూ.2 కోట్లతో మరిన్ని పనులు చేపడతాం. గుల్లలపాలెం వుడా కాలనీలో సుమారు రూ.40 లక్షలతో నూతన హంగులతో చిల్డ్రన్ పార్కు ఏర్పాటు చేస్తున్నాం. తాగునీటి కష్టాలు లేకుండా చేస్తాం. కొండ ప్రాంతాల్లో రక్షణ గోడలు నిర్మిస్తాం. ప్రజలు తాము చేస్తున్న అభివృద్ధిని గుర్తించి ఆశీర్వదించాలి.

– ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త

రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవ చేస్తా..

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- ఘనంగా ఆడారి పుట్టినరోజు వేడుకలు

విశాఖ విద్య: తండ్రి చూపిన బాటలో నడుస్తూ రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవకే జీవితం అంకితం చేస్తానని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. ఆనంద్ కుమార్ పుట్టిన రోజు వేడుకల శనివారం నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో ఘనంగా నిర్వహించారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. 52వ వార్డు శాంతినగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన వేడుకల్లో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సమక్షంలో ఆనంద్‌కుమార్ రోజు కేక్ కట్ చేశారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సమకూర్చిన వస్త్రాలను పంపిణీ చేశారు.

- 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో వైస్సార్ సీపీ వార్డు నాయకుడు నమ్మి శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఆనంద్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బీ.ఎస్.కృష్ణ, సీతారామరాజు నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

గోపాలపట్నం: జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు, 91, 92 వార్డుల అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు ఆధ్వర్యంలో కుమారి కల్యాణ మండపంలో ఆడారి ఆనంద్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి పాల్గొన్నారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.



వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఆనంద్‌కుమార్, మేయర్ హరివెంకటకుమారి, డిప్యూటీ మేయర్ శ్రీధర్

- జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో పీఏసీఎస్ కార్యాలయం ప్రాంగణంలో క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు, శరగడం సురేష్, మాజీ కార్పొరేటర్ అయితంశెట్టి కోటేశ్వరరావు ఆనంద్‌కుమార్‌ను గజమాలతో సత్కరించారు. ఆనంద్ కుమార్ చేతుల మీదుగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

మల్కాపురం: 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీలో కార్పొరేటర్ పి.వి.సురేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన వేదికపై ఆనంద్‌కుమార్ కేక్ కట్‌చేశారు. చిన్నారులకు నోట్ బుక్స్, పండ్లు, బిస్కెట్లు అందజేశారు. వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు చైర్మన్ ఆల్ఫా కృష్ణ, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బద్రీనాథ్, పలు వార్డుల కార్పొరేటర్లు బల్లా లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, కొణతాల సుధ, లావణ్య, మాజీ కార్పొరేటర్లు గల్లా శ్రీనివాస్, పిల్లా కన్నబాబు, క్లస్టర్ అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్, మహిళా నాయకులు మళ్ల ధనలత పాల్గొన్నారు. 61వ వార్డు మల్కాపురంలో కార్పొరేటర్ కొణతాల సుధ, బద్రీనాథ్, వార్డు పార్టీ అధ్యక్షుడు జి.వి.ఎస్.ఎన్.రాజు(కేబుల్ వాసు) పేద మహిళలకు చీరలు అందించారు. 58వ వార్డులో కార్పొరేటర్ లావణ్య కేక్ కట్‌చేశారు.



గోపాలపట్నంలో ఆడారి ఆనంద్‌కుమార్‌ను సత్కరిస్తున్న బెహరా భాస్కరరావు తదితరులు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌టీయూసీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి కలిదిండి బద్రీనాథ్ కేక్ కట్‌చేసి పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

విశాఖ విద్య: జీవీఎంసీ పరిధిలోని విశాఖ, భీమిలి, అనకాపల్లి డివిజన్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతి పత్రం అందజేశారు. జీపీఎఫ్ నగదు ఉపాధ్యాయుల వ్యక్తిగత ఖాతాల్లోకి తక్షణమే జమ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2014 డీఎస్సీ ఉపాధ్యాయుల నియామక తేదీల్లో మార్పు చేయాలన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి, విశాఖ జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శులు గొంది చిన్నబ్బాయి, టి.ఆర్ అంబేద్కర్, అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, విశాఖ జిల్లా కోశాధికారి రాంబాబు, నాయకులు ఎం.రాజునాయుడు, శోభ తదితరులు పాల్గొన్నారు. వినతి పత్రాన్ని పరిశీలించిన కమిషనర్ తగు చర్యలు తీసుకుని, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.



జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

క్వార్టర్ ఫైనల్స్‌లో జీవీఎంసీ జట్టు విజయం



విజయోత్సాహంలో జీవీఎంసీ జట్టు

గాజువాక : జీవీఎంసీ, హెచ్‌పీసీఎల్ జట్ల మధ్య జింక్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన వీడీసీఏ ఇన్‌స్టిట్యూషన్స్ మొదటి క్వార్టర్ ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌లో జీవీఎంసీ జట్టు ఐదు పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మొదటిగా బ్యాటింగ్‌ను ప్రారంభించిన జీవీఎంసీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టపోయి 131 పరుగులను చేసింది. జీవీఎంసీ తరఫున సునంద 43, నరేష్ కుమార్ 26 పరుగులు చేశారు. హెచ్‌పీసీఎల్ తరఫున మోహన్ కుమార్ 4, వివేక్‌సింగ్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన హెచ్‌పీసీఎల్ జట్టు 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు నష్టపోయి 126 పరుగులు మాత్రమే చేయగలిగింది. జీవీఎంసీ తరఫున సుబ్రహ్మణ్యం 3, కెప్టెన్ శివ 2 వికెట్లను సాధించి తమ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, టీమ్ మేనేజర్ సన్నీ అభినందించారు.

సేద్యానికి సాంకేతిక సాయం

- అధికారులకు జేసీ విశ్వనాథన్ ఆదేశం

మహారాణిపేట: ఆధునిక సాంకేతిక సహకారంతో రైతులకు మెరుగైన సేవలందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ సూచించారు. తన చాంబర్‌లో శనివారం జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సభ్యులతో కలిసి ధాన్యం కొనుగోలు ,ఇతర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జేసీ.. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై పలు సూచనలు చేశారు. వ్యవసాయ, అనుబంధ రంగాల రైతులకు సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 10 ప్రొక్యూర్ సెంటర్లలో ఆరు వేల టన్నులకు గానూ 4,280 టన్నులు ప్రొక్యూర్ చేసినట్లు గుర్తు చేశారు. ఫిబ్రవరి రెండో వారంలోగా లక్ష్యాలను సాధించాలన్నారు. ఫిబ్రవరి 15లోగా రబీలో వేసిన పంటను మొత్తం ఈ క్రాప్ చేయాలన్నారు. అర్హత కలిగిన వారికి పంట రుణాలు రెన్యువల్ చేయాలని ఆదేశించారు. ఆర్బీకేల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండాలన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డీవీపీ ప్రసాద్‌రాజు, జేడీ అప్పలస్వామి, మండల స్థాయిలో చర్చించిన విషయాలను జేసీ దృష్టికి తీసుకెళ్లారు. పశు సంవర్ధక శాఖ జేడీ రామకృష్ణ, అసిస్టెంట్ ఎల్.డి.ఎం.రమణబాబు, పౌర సరఫరాల కార్పొరేషన్ డీఎం రాజేశ్వరి, ఉద్యానవన అధికారి మన్మథరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

భీమిలి తీరంలో భారీ డాల్ఫిన్ కళేబరం

భీమునిపట్నం: భీమిలి తీరానికి శనివారం సాయంత్రం భారీ డాల్ఫిన్ కళేబరం కొట్టుకొచ్చింది. రెండు రోజుల కిందట ఇది చనిపోయి ఉంటుందని స్థానిక మత్స్యకారులు భావిస్తున్నారు. సముద్ర ఉపరితలంపై ఉష్ణోగ్రతల్లో మార్పులు, కాలుష్యం కారణంగా ఇది మృతి చెంది ఉంటుందని చెబుతున్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం చదును

- అభ్యంతరం తెలిపిన ఎల్జీపాలిమర్స్ అధికారులు
- బెహరా నిలదీతతో వెనుదిరిగిన వైనం

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు అజంతా పార్క్ వద్ద జీవీఎంసీ స్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ పనులు చేపట్టేందుకు స్థలం చదును చేస్తున్న సమయంలో ఎల్జీ పాలిమర్స్ అధికారులు, సెక్యూరిటీ గార్డులు అడ్డుకునేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఘటనా స్థలానికి వెళ్లి పనులు అడ్డుకునేందుకు మీకేమి అధికారముందని నిలదీశారు. అయితే మీ పత్రాలు తీసుకుని పాలిమర్స్ ఆఫీసుకు రావాలని చెప్పడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ స్థలంపై మీకు అధికారిక పత్రాలు ఉంటే తీసుకుని వచ్చి మాట్లాడాలని బెహరా స్పష్టం చేశారు. దీంతో తోకముడిచి వెళ్లిపోయారు. దీంతో ఇక్కడి పనులు సజావుగా సాగాయి. మధ్యాహ్నం సమయంలో జీవీఎంసీ ఈఈ రమణ మూర్తి, డీఈ విజయ్ కుమార్‌ల మరో సారి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా బెహరా భాస్కరరావు మాట్లాడుతూ గతంలో సర్వే చేయించిన అనంతరం కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.20.60 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. తమది కాని స్థలంపై ఎల్జీ పాలిమర్స్ అధికారులు పెత్తనం చెలాయిస్తున్నారని అన్నారు. దీనిపై తాను ఎంతవరకైనా వెళ్తానని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో అజంతా పార్క్ వాసులు పాల్గొన్నారు.



పనులు ఆపేది లేదని చెబుతున్న బెహరా భాస్కరరావు

అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం, పద్మనాభనగర్, కంపరపాలెం పరిసర ప్రాంతాల్లో శనివారం జీవీఎంసీ అధికారులతో కలిసి జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పర్యటించారు. వెంకటాపురం, పద్మనాభనగర్ శ్మశాన వాటికల అభివృద్ధి, కంపరపాలెం పార్క్ అభివృద్ధిపై జీవీఎంసీ అధికారులతో ఆయన సమీక్షించారు. ఇక్కడి స్థలాలను పరిశీలించి ఏవిధంగా అభివృద్ధి చేయాలో ప్రణాళికలు చేశారు. కంపరపాలెం పార్క్‌కు ప్రహరీ నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ పనులపై అంచనాలు రూపొందించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఈఈ రమణ మూర్తి, డీఈ విజయ్ కుమార్, స్థానిక నాయకులు కంపర కోటేశ్వరరావు, కంపర రామకృష్ణ, నీలాపు లోకేష్ రెడ్డి, జగదీష్ అభిరాం, రాపర్తి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

దళితులను అణగదొక్కడమే మీ లక్ష్యమా?

- పచ్చ పత్రికలు చంద్రబాబుకు వంత పాడడం సిగ్గుచేటు
- మార్కెట్ కమిటీ చైర్మన్ జీ.ఎస్.కృష్ణ



విశాఖ విద్య: దళిత వర్గాలను ఇంకా అణగదొక్కాలనే ధోరణితో చంద్రబాబు అండ్‌కో వ్యవహరించడం మానుకోవాలని విశాఖపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ బీ.ఎస్. కృష్ణ(ఆల్ఫా కృష్ణ) అన్నారు. శనివారం ఆయన ఎస్‌ఏడీ సెంటర్‌లో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం దళితులకు సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాజకీయ పదవుల్లోనూ పెద్దపీట వేస్తున్నారన్నారు. సామాజిక సమతుల్యత పాటిస్తూ అన్ని రంగాల్లోనూ దళితులను ముందుకు తీసుకెళ్తుంటే, ఓర్వలేనితనంతో చంద్రబాబు విషం చిమ్ముతుండటం సిగ్గుమాలిన చర్యని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వంలో దళితులను ఊరి చివరనే మగ్గిపోయేలా చేసిన చర్యలను దళిత జాతి ఇంకా మరిచిపోలేదన్నారు. చంద్రబాబు చేష్టలను దళిత మేధావులు సైతం తప్పుపడుతుంటే, ఆయనకు వత్తాసు పలికే పత్రికలు మాత్రం ప్రజలను మభ్యపెడుతూ, తప్పుడు రాతలు రాస్తుండటం సమంజసం కాదన్నారు. చంద్రబాబుకు మరో మారు బుద్ధిచెప్పేందుకు దళితులంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

ప్రజల సహకారంతో చోరీలకు చెక్



నేరాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న క్రైం ఎస్ఐ సూర్యనారాయణ

గోపాలపట్నం: దొంగతనాల నియంత్రణకు ప్రజల సహకారం అవసరమని గోపాలపట్నం క్రైం ఎస్ఐ వై.సూర్యనారాయణ అన్నారు. గోపాలపట్నం సాయి ప్రియ హైట్స్ అపార్ట్‌మెంట్‌లో నేరాల నియంత్రణపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాత్రి సమయాల్లో పగటి పూట హౌస్ బ్రేకింగ్ చేయడం, ద్విచక్రవాహనాలపై వచ్చి చైన్‌స్నాచింగ్ వంటి నేరాలు జరగకుండా నియంత్రించేందుకు సహకరించాలని కోరారు. అపార్ట్‌మెంట్లలో సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రోజుల తరబడి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు పోలీసులు ద్వారా ఎల్‌హెచ్‌ఎంఎస్ ఉపయోగించుకోవాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు తారసపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ గోవిందమ్మ, సిబ్బంది అర్జున్, శివకృష్ణ యాదవ్, అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.